క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి మండల తహసీల్దార్‌గా కె. రమేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు తహసీల్దార్ రమేశ్‌కు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పని చేసిన మునావర్ షరీఫ్ దహెగాం మండలానికి బదిలీపై వెళ్లగా.. మంచిర్యాల జిల్లాలో తహసీల్దార్ విధులు నిర్వహిస్తున్న కె.రమేశ్ మండలానికి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ దౌలత్, ఆర్ఐ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

గిరవెల్లిలో రెవెన్యూ సదస్సు



దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్

దహెగాం: భూభారతి చట్టం 2025లో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. సోమవారం మండలంలోని గిరవెల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల సమస్యలపై రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మునవర్ షరీఫ్ మాట్లాడుతూ.. భూముల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. రైతులు భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదలకు గూడు కల్పించడమే ధ్యేయం



తుంగెడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న రమేశ్

రెబ్బెన: రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలకు గూడు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆర్టీఏ నాన్ అఫిషియల్ మెంబర్, పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని తుంగెడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి ప్రొసిడింగ్ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేసే దిశగా ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటికే అనేక హామీలను అమలుచేసిన సీఎం రేవంత్‌రెడ్డి మిగిలిన హామీలను సైతం సాధ్యమైనంత త్వరలో అమలుచేస్తారన్నారు. నాయకులు పూదరి హరీశ్, మాజీ సర్పంచ్ రవీందర్, గ్రామ అధ్యక్షుడు డోంగ్రి తిరుపతి, నాయకులు మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన విధానం రద్దు చేయాలి



మాట్లాడుతున్న లోకేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: నూతనంగా అమలు పరుస్తున్న పోల్‌టాక్స్ విధానాన్ని రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేశ్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రహమాన్‌లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రోజ్‌గార్డెన్స్‌లో జిల్లాలోని కేబుల్ ఆపరేటర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నూతన పోల్‌టాక్స్ విధానంతో కేబుల్ ఆపరేటర్లకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కేబుల్ ఆపరేటర్లకు కేబుల్ వైర్ సవరణ కోసం సమయం ఇవ్వాలని, కేబుల్ ఆపరేటర్లకు క్యాటగిరీ1 కింద గుర్తించాలని డిమాండ్ చేశారు.

కేబుల్ ఆపరేటర్ల హడక్ కమిటీ ఎన్నిక

కేబుల్ ఆపరేటర్ల హడక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ముఖ్య సలహాదారుడిగా అల్లూరి లోకేశ్, అబ్దుల్ రహమాన్, కన్వీనర్‌గా సాజిద్, కో-కన్వీనర్‌గా అశోక్, సభ్యులుగా వహీద్‌ఖాన్, దిలీప్, కిరణ్, స్వప్న, సంపత్, సాయికృష్ణ, నగేశ్, జమీల్‌లను ఎన్నుకున్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా..?



గుంతల్లో నిలిచిన నీరు



గుంతలతో అధ్వానంగా మారిన బీటీరోడ్డు

- ప్రధాన రహదారిపై కానరాని పట్టింపు
- గుంతలమయంగా బీటీరోడ్డు
- చెరువులను తలపిస్తున్న రహదారి
- ఇబ్బందులు పడతున్న వాహనదారులు

తిర్యాణి: గుంతలతో అధ్వానంగా మారిన రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి పూట గుంతల రోడ్లపై రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు జంకుతున్నారు. మండలంలోని చిన్న అరటిపెల్లి స్టేజి నుంచి తాండూర్ మండలంలోని శ్రీ ఇన్‌క్లెయిన్ వైపు వెళ్లే దారి గుంతలమయంగా మారడంతో ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా నేటికీ సరైనా మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో రోడ్డంతా గుంతలమయంగా మారి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

చెరువులను తలపిస్తున్న గుంతలు..

మండలంలోని మొర్రిగూడ స్టేజి నుంచి మొదలుకొని అరటిపెల్లి స్టేజి వరకు రోడ్డుపై అడుగడుగున పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మండల కేంద్రం నుంచి వందలాది మంది ప్రజలు నిత్యం ఉద్యోగాలు, నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం మంచిర్యాల జిల్లాకు వెళ్తుంటారు. రహదారి ప్రయాణికులకు అనుకూలంగా లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతల రోడ్లపై నిత్యం ప్రయాణాలు సాగించడం ద్వారా డిస్క్ (వెన్నుపూస, నడుంనొప్పి) వంటి సమస్యలు తలెత్తున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



చిన్న అరటిపెల్లి స్టేజి నుంచి మొర్రిగూడ స్టేజి వరకు రోడ్డుపై విపరీతంగా గుంతలు ఉన్నాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. అత్యవసర సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణం చేయడం సాహసంగా మారింది. అధికారులు స్పందించకుంటే త్వరలోనే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– తోడసం భాస్కర్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు

సమస్య పరిష్కరించాలి



రోడ్డుపై అధికంగా గుంతలు ఉండటంతో రాత్రి వేళలో ద్విచక్ర వాహనంపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. రోడ్డుకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

– సార రమేశ్‌గౌడ్, రాళ్ల కన్నెపల్లి

ప్రభుత్వ బడుల్లోనే ఉత్తమ బోధన

వాంకిడి: ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలతో కూడిన ఉత్తమ బోధన లభిస్తుందని తహసీల్దార్ డి.కవిత, ఎంఈవో శివచరణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఇందాని గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రధాన కూడలి వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియం బోధన ఉంటుందని, భోజనం, పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫాం ఉచితంగా పంపిణీ చేస్తామని వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు నవీన్, మహేశ్, శ్రీనివాస్, ప్రేమ్‌సింగ్, పద్మ, శ్రావణి, శ్వేత, వినోద్, జలీల్, సీఆర్పీ దుర్గం సందీప్ తదితరులు పాల్గొన్నారు.



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

కౌటాల: బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. సోమవారం మండలంలోని గురుడుపేటలో ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యా బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, పాఠశాలలకు అన్నివసతులు కల్పిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించేందుకు ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నైతం సాయినాథ్, పి ప్రదీప్, రమాదేవి పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

కెరమెరి: బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గోయగాం ప్రాథమిక ప్రధానోపాధ్యాయుడు రవితేజ సొంతంగా కరపత్రాలను ముద్రించి ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు విద్యార్థులకు అందించే బోధనపై క్లుప్తంగా కరపత్రాల్లో వివరించారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు కరపత్రాలు అందించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం కొనసాగింది. బడిబయట, బడికి వెల్లని, డ్రాపవుట్ విద్యార్థులు ఇళ్లకు వెళ్లి బడికి రావాలని అవగాహన కల్పించారు. ర్యాలీలు నిర్వహించారు.



బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న రవితేజ

జీవో నంబర్ 49 రద్దు చేయాలి

కెరమెరి: టైగర్ కారిడార్ పేరుతో ఏర్పాటు చేసిన జీవో నంబర్ 49ను రద్దు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ అన్నారు. సోమవారం మండలంలోని కెస్లాగూడలో నల్లజెండాతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ అటవీ అధికారులకు కనువిప్పు కలిగే విధంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో నల్లజెండాలతో నిరసనలు తెలుపుతామన్నారు. ఆదివాసీ హక్కులను కాలరాసే విధంగా తీసుకొచ్చిన జీవో 49ను రద్దు చేయకుంటే దశలవారీగా ఉద్యమాలు చేపడతామన్నారు. ఆదివాసీలపై అక్రమంగా కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు నాగోరావు, విశ్వేశ్వరరావు, జ్యోతిరాంచ యశ్వంత్‌రావు, దినకర్‌శావ్, సెద్మురావు, సుంగు, వసంత్‌రావు, కినక భీంరావు, హన్మంతు తదితరులు ఉన్నారు.



నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న తుడుందెబ్బ నాయకులు

12లోపు యూనిఫామ్‌లు అందించాలి

కెరమెరి: ఈ నెల 12వ తేదీలోపు విద్యార్థుల కు యూనిఫాంలు అందించాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో మండల సమాఖ్య సీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 65 శాతం యూనిఫా మ్‌లు కుట్టడం పూర్తయిందని సీసీలు తెలపగా.. 12వ తేదీ లోపు వంద శాతం పూర్తి చే యాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు జీవన్, సత్తయ్య, దస్తగిరి, ధన్‌రాజ్, శ్యాంరావు, సుజాత, కౌసల్య, సుబ్బారావు, విజయ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

నేడు శిక్షణ

కెరమెరి: మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లకు మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఆడే ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ హాజరయ్యే విధంగా హెచ్‌ఎంలు చొరవ చూపాలని పేర్కొన్నారు.

అనుమతులు లేని వెంచర్లపై ఫిర్యాదు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గుండి రోడ్డు సమీపంలో, భాగ్యనగర్, సందీప్‌నగర్, ఆర్‌ఆర్ కాలనీ, జన్కాపూర్‌ల్లో విచ్చలవిడిగా డీటీసీపీ అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లు వేసి పాట్లు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావ్‌కు డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపల్ కేంద్రంగా మారిన తర్వాత విచ్చలవిడిగా వెంచర్లు వేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు మున్సిపల్ అధికారులు బ్యానర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణ కరువు!

ఆసిఫాబాద్‌అర్బన్: రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని సాయినివాడలో గత ఐదు నెలలుగా పారిశుద్ధ్య పనులు నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. సాయినివాడకు చెత్త తీసుకెళ్లే వాహనం రావడం లేదని, డ్రైయినేజీని శుభ్రపర్చడం లేదని, వీధిదీపాల నిర్వహణ సరిగా ఉండడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సిబ్బందిని నియమించి రాజంపేట జీపీలోని కాలనీల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



రాజంపేట సాయినివాడలో పేరుకుపోయిన చెత్తాచెదారం



డ్రైయినేజీలో పెరిగిన పిచ్చిమొక్కలు

విద్యతోనే విముక్తి

- సుందిళ్ల రమేశ్ కృషి అభినందనీయం
- విద్యాశాఖ కమిషన్ సలహాదారుడు వెంకట్‌రెడ్డి

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యతోనే విముక్తి దొరుకుతుందని, జిల్లావ్యాప్తంగా 15 మండలాల్లోని 15 గిరిజన గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేశ్ విద్యా చైతన్య యాత్ర చేపట్టడం అభినందనీయమని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సలహాదారుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని జోడేఘాట్‌లో సోమవారం విద్యా చైతన్య యాత్ర ముగింపు సదస్సు కార్యక్రమంలో మాట్లాడారు. అక్షరం జీవితాన్నే మార్చుతుందన్నారు. ఉపాధ్యాయులందరూ రమేశ్ మాదిరి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆదివాసీల కోసం ప్రత్యేక విద్యా ప్రణాళిక రూపొందించాలని, మండలం ఒక యూనిట్ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని విద్యార్థులను జోడేఘాట్‌లోని మ్యూజియానికి విహార యాత్రకు తీసుకెళ్లేలా టూరిజం శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భీం సమాధిపై పూలు చల్లి పూజలు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సీతారాం, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కడేర్ల రంగయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు రేగుంట కేశవరావు, గ్రామ పటేల్ పెందోర్ రాజేశ్వర్, హెచ్‌ఎం మోతీరాం పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న వెంకట్‌రెడ్డి, నాయకులు

‘ఈఎస్ఐ కంట్రిబ్యూషన్ నిలిపివేత సరికాదు’

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ పేపర్ మిల్లులో పనిచేస్తున్న సుమారు 350 మంది కార్మికులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఈఎస్ఐ కంట్రిబ్యూషన్ నిలిపివేయడం సరికాదని తెలంగాణ సిర్పూర్ పేపర్ మిల్లు ఎంప్లాయీస్ యూనియన్– 2735 నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలో ఎస్పీఎం యజమాన్యం ఐఆర్, హెచ్‌ఆర్‌లకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఈఎస్ఐ కంట్రిబ్యూషన్ నిలిపివేయడంతో కార్మికులు సెక్యూరిటీ బెనిఫిట్లతోపాటు రూ.5 లక్షల వైద్య సదుపాయం కోల్పోతున్నారని తెలిపారు. ఉచిత వైద్య సదుపాయానికి దూరమవుతారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి లోకల్ ఆఫీస్ మేనేజర్, ఈఎస్ఐ కార్పొరేషన్ అధికారులతో న్యాయ విచారణ జరిపి, ఈఎస్ఐ కంట్రిబ్యూషన్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుభాష్, గోలెం వెంకటేశ్, గోగర్ల రాములు, చిట్టవేణి రాజేశ్, గోగర్ల శ్యాంరావు, శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేసి రామగుండం రీజియన్‌కు బదిలీపై వెళ్తున్న డీవైపీఎం నాగుల వేణును సోమవారం కై రిగూడ ఓసీపీ ఉపరితలంలో గని అధికారులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ మాట్లాడుతూ కైరిగూడలో పని చేస్తున్న ఉద్యోగులకు వెల్ఫేర్ అధికారిగా వేణు ఎన్నో సేవలు చేశారన్నారు. ఓసీపీలో పనిచేసే ఉద్యోగుల పర్సనల్ రికార్డులను ప్రత్యేకంగా పరిశీలించి కార్మిక కుటుంబాలకు, పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారని, సెటిల్మెంట్, మానిటింగ్ బెనిఫిట్స్, పెన్షన్స్, సీఎంపీఎఫ్ తదితర చెల్లింపుల్లోనూ అత్యంత చురుకుగా పని చేసి కార్మికులు ఎక్కడ కూడ ఇబ్బందులకు గురి కాకుండా చూసుకున్నారన్నారు. బదిలీపై వెళ్తున్న చోట సైతం ఇదే స్థాయిలో కార్మికుల మన్ననలు పొందాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి కిరణ్‌కుమార్, శేషశయనరావు, రాజేశ్, సేఫ్టీ, మైన్స్ కమిటీ సభ్యులు, నాయకులు సత్తయ్య, సత్యనారాయణ, కోటి, నరేశ్, రారాజు, కాసీం అలీ, హర్షద్ బాబా, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న డీవైపీఎం వేణును సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: టీఎస్ టెట్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఏఎస్‌యూయా జిల్లా కోఆర్డినేటర్ మహ్మద్ ఆబిద్ ఖాద్రి అన్నారు. పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాలలో సెంట్రల్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం టీఎస్ టెట్ ఉర్దూ మీడియం పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉర్దూ మీడియం విద్యార్థులకు మైనార్టీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మే 6 నుంచి జూన్ 4 వరకు టెట్ ఉచిత శిక్షణ అందించగా, 45 మంది హాజరయ్యారని తెలిపారు. జూన్ 18న జరిగే టెట్‌లో ర్యాంక్ సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం టౌన్ అధ్యక్షుడు ముబీన్, ఉపాధ్యాయులు జావీద్, షేక్ సర్వర్, ఇర్షద్ ఉల్ ఖాన్, అబ్దుల్ ముకీమ్, సలీం, సమ్రీన్ నాజ్, షేక్‌నజీర్ పాల్గొన్నారు.



టెట్ పుస్తకాలు అందజేస్తున్న మహ్మద్ అబిద్ ఖాద్రి

మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రెబ్బెన: గోలేటి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పైకి మురికినీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. తరచూ మురికినీరు రోడ్డుపైకి వస్తుండటంతో ఆగ్రహించిన గ్రామస్తులు సోమవారం ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గోలేటి పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌లోని మురికి కాలువల ద్వారా వచ్చే నీటిని సింగరేణి రహదారి పక్క నుంచి వెళ్తున్న మురికికాలువకు అనుసంధానం చేయడంతో పెద్దఎత్తున మురికినీరు కాలువ ద్వారా ప్రవహిస్తూ గోలేటికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న మురికికాలువలోకి వచ్చి చేరుతోందన్నారు. దాంతో ముందు వెళ్లే మార్గం లేక మురికినీరంతా పంట భూముల్లోకి, ప్రధాన రోడ్డుపైకి వస్తోందని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి రవీందర్ సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డు పైకి మురికి నీరు రాకుండా అడ్డుకట్ట వేయించారు. అయితే ప్రస్తుతం కాలువను మూసివేయడంతో నీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేక సింగరేణి ప్రధాన రహదారి పైకి వచ్చే అవకాశం ఉందని, సమస్యకు శాశ్వత పరిష్కారం ఉండేలా మురికినీరు ఊరు చివరికి వెళ్లేలా కాలువ నిర్మించాలని డిమాండ్ చేశారు.